క్లుప్తంగా

క్లాప్ మిత్రలకు వైద్యపరీక్షలు



వినుకొండ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏనుగుపాలెం పీహెచ్‌సీ సెంటర్‌లో క్లాప్ మిత్రలకు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగేశ్వరరావు నాయక్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ సుందర్‌రెడ్డి, సర్పంచ్ మాదినేని వెంకట లక్ష్మీ, మండల స్వచ్ఛభారత్ మిషన్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, ఏన్ఎంలు, ఆశ వర్కర్స్, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

సామూహిక మహాలయ అమావాస్య పితృతర్పణాలు



వినుకొండ: పట్టణంలోని గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం పక్కన గల అపర కర్మల సత్రంలో వినుకొండ ప్రాంత ప్రజల కోసం పట్టణ పురోహితుడు డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక పితృ తర్పణాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యడవల్లి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ పితృకర్మలు ఆచరించడం ద్వారా వంశాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి, సర్వ ఆటంక నివారణలు జరుగుతాయని, ప్రతిఒక్కరూ పితృకర్మాచరణ చేయాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నరసరావుపేట రూరల్: ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఆదివారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ జిల్లా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎ.తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి బి.సత్యం, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆర్.గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. గత విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందిన మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, జిల్లాస్థాయి ఉత్తమ మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు.

నీట మునిగిన యానాది కాలనీ



నూజెండ్ల: భారీ వర్షాలకు మండలంలోని కమ్మవారిపాలెం యానాది కాలనీ నీటిలో తేలియాడుతుంది. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు సమీపంలో ఉన్న వాగు నీరు కాలనీని ముంచెత్తింది. ఇళ్ల లోకి నీరు చేరటంతో కనీసం వంట చేసుకునే పరిస్థితి కూడా లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికి పూరిగుడిసెలు కారుతున్నాయని వాపోతున్నారు. కాలనీ చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాత్రిళ్లు సమీప గ్రామంలో తలదాచుకుంటున్నా మంటున్నారు. వరద నీటితో పాములు, తేళ్ళు ఇళ్ళలోకి వచ్చేస్తుండటంతో భయభయంగా గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానాది కాలనీని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే దత్తత తీసుకోవటం జరిగింది. ఇంటి స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు కట్టించే ఏర్పాటు చేస్తామని కాలనీవాసుల సమక్షంలో హామీ ఇవ్వటం జరిగింది. అయితే పనులు ముందుకు సాగకపోవటంతో ఇళ్ల స్థలాల కోసం వారి ఎదురు చూపులు కొనసాగుతున్నాయి. వెంటనే ఇళ్ళ స్థలాలు కేటాయించి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేటి నుంచి దసరా శరన్నవ రాత్రి వేడుకలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో నేటి నుంచి దసరా శరన్నర రాత్రి వేడుకలు ప్రారంభమై అక్టోబరు 2వ తేదీతో ముగుస్తాయని దేవస్థాన కమిటీ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల వేడుకలు ప్రతి ఏటా గ్రామస్తులు దాతలు సహకారంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. నవరాత్రులు వేడుకలు పురస్కరించుకొని అమ్మవారు రోజుకో అలంకరణ చొప్పున భక్తులకు దర్శనం ఇస్తుందన్నారు. మొదట రోజు 22వ తేదీ బాలత్రిపురసుందరిదేవి, 23 గాయత్రిదేవి, 24 అన్నపూర్ణదేవి, 25 కాత్యాయనిదేవి, 26 మహాలక్ష్మిదేవి, 27 లలితాత్రిపురసుందరిదేవి, 28 మహాచండీదేవి, 29 సరస్వతీదేవి, 30 దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసురమర్దని, అక్టోబర్ 2వ తేదీన రాజరాజేశ్వరి అలంకరణతో భక్తులకు అమ్మవారు దర్శనం ఇస్తుందన్నారు. అమ్మవారి అలంకరణ నిర్వహణ పూజ కార్యక్రమాలు ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ సారథ్యంలో జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయాన్నే ఉభయ దాతలచే అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు వితరణ చేసిన తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు దేవాలయం ప్రాంగణంలో భక్త బృందంచే భజన కార్యక్రమాలు, మేళతాళాల నడుమ వైభవంగా జరుగుతాయన్నారు. దాతలు అందజేసిన ప్రోత్సాహక బహుమతులను లాటరీ విధానం ద్వారా తీసి మహిళ భక్తులకు అందజేస్తామన్నారు. భక్తులందరు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

ముస్తాబైన ఆలయాలు

నాదెండ్ల: దసరాను పురస్కరించుకుని సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. 11 రోజుల పాటూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి నవరాత్రులు నిర్వహించనున్నారు. గణపవరం కోదండరామాలయంలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. శాంతినగర్‌లోని కోదండరామాలయం, సాతులూరు గంగాపార్వతీ సమేత సోమేశ్వరాలయం, తూర్పు బజారులోని ఆర్యవైశ్య వీధిలో రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, కాటి అంకమ్మ, తేనె అంకమ్మ ఆలయం, విఘ్నేశ్వరాలయం, నాదెండ్లలోని శివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నరసరావుపేట ఈస్ట్: విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభంకానున్నాయి. ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలలో అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించనున్నారు. ఉత్సవాలకు పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పాతూరులోని గంగా పార్వతీ సమేత శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయం, చెరువుకట్ట వీధిలోని చౌడేశ్వరీ ఆలయం, శ్రీవిజయ చాముండేశ్వరీ ఆలయం, సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం, శృంగేరీ శంకరమఠం తదితర ఆలయాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శృంగేరీ శంకర మఠంలో..

శ్రీశృంగేరీ శంకర మఠంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శారదా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీశారదాంబ అమ్మవారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు ఒడిలో బాలుడితో జగత్ప్రసూతిక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



అమ్మవారి మూల విరాట్



సాతులూరు వేణుగోపాలస్వామి ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ



జగత్ప్రసూతిక అలంకరణలో శారదాంబ అమ్మవారు



నరసరావుపేటలోని శృంగేరీ శంకరమఠం ప్రవేశ ద్వారం



ముస్తాబైన శావల్యాపురంలోని దుర్గాదేవి ఆలయం

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఐదుగురు ఎంపిక



నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన అచ్చంపేటలో అండర్–14, 17, బాలబాలికల జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అండర్–14 బాలికల ఫ్రీస్టైల్ విభాగంలో ఎం.శ్రీవిద్య, వై.తేజస్విని, జి.గాయత్రిలు, అండర్–17 విభాగంలో ఎం.కావ్య, జి.భూలక్ష్మిలు ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికై నట్టు తెలిపారు. ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఐ.సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పాడి రైతులకు బోనస్

సత్తెనపల్లి: పట్టణంలోని రంగాకాలనీ సంగం డెయిరీ వెండర్ పాయింట్‌లో పశుపోషకులకు 2024–25 సంవత్సరానికి బోనస్‌ను ఆదివారం పంపిణీ చేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమారి, డెయిరీ మేనేజర్ తాడి బోయిన గోపి, రూట్ సూపర్‌వైజర్ శాఖమూరి నరేష్, పాల డెయిరీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు సమక్షంలో బోనస్ మొత్తం రూ.1.47 లక్షలు పంపిణీ చేశారు. సయ్యద్ ఖాసింవలికి అత్యధికంగా రూ.12,500 అందగా సీహెచ్ నాగేశ్వరరావు, షేక్ సైదా కూడా అత్యధిక బోనస్ అందుకున్నారు.

దోమల ఉత్పత్తి కేంద్రాలు

- చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- దోమలు, విష పురుగులకు ఆవాసం
- జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్న జనం
- పట్టించుకోని అధికారులు

చిలకలూరిపేట: ఖాళీ ప్రదేశాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పొదలు పెరిగి వృథలుగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరింగ్ నిర్వహించకపోవడమే దీనికి కారణం. ఫిర్యాదులు వచ్చినప్పుడు అప్పుడప్పుడు అక్కడక్కడా జంగిల్ క్లీనింగ్ చేయడం, ఆ తదుపరి పట్టించుకోకపోవడంతో తిరిగి యథాస్థితికి చేరుతున్నాయి. కంప తొలగింపు పనులు చేపట్టక పట్టణంలోని నివాస ప్రాంతాల మధ్య ఉన్న పలు ఖాళీ స్థలాలు దోమల పెంపక కేంద్రాలుగా మారుతున్నాయి. చిట్టడువుల్లా పెరిగిన తుమ్మ చెట్లు, వాటిలో చేరుతున్న వర్షపు, మురుగునీరు దోమలవ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సమావేశంలోనూ కౌన్సిలర్లు ఇదే విషయాన్ని ప్రస్తావించటం సైతం గమనార్హం. నిల్వ ఉన్న నీటి కారణంగా దోమలు పెరిగి విషజ్వరాలు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పట్టణంలో 48 మురికివాడలు..

పట్టణ పరిధిలో 48 మురికివాడలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా ప్రతిచోట ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు పెరిగి ఉన్నాయి. ముఖ్యంగా రజకకాలనీ, మోమిన్‌బజార్, రూత్‌డైక్‌మెన్ కాలనీ, మారుతినగర్, మద్దినగర్, ఎన్టీఆర్ కాలనీ, ఆది ఆంధ్రాకాలనీ, వైఎస్సార్ కాలనీ, వీరముష్టికాలనీ, భావనారుషినగర్ తదితర ప్రాంతాలలో ఈ పరిస్థితులు నెలకొని ఉంటాయి. కొంతమంది ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన స్థలాలను ఖాళీగా వదిలి వేయటం, మరికొంతమంది భవిష్యత్తులో స్థలాలకు మంచి ధర పలుకుతుందన్న ఉద్దేశంతో కొని ఖాళీగా వదిలివేయడంతో, ఆ స్థలాల్లో క్రమేపీ కంప పెరుగుతోంది.

అపరిశుభ్ర పరిస్థితులు..

నివాస ప్రాంతాల మధ్య ఖాళీ ప్రదేశాలలో పెరిగిన ఈ కంపచెట్ల మూలంగా కేవలం దోమలు పెరగటం, అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడటమే కాకుండా, విద్యుత్ లైన్లకు అంతరాయంగా మారుతున్నాయి. వీటిని సంబంధిత స్థల యజమానులకు తొలగించాల్సిందిగా పురపాలక సంఘం ద్వారా నోటీసులు జారీ చేసి తొలగింపజేయాల్సి ఉంటుంది. అదే ప్రభుత్వ స్థలాలు, పోరంబోకులలో పెరిగిన కంపను పురపాలక సంఘం వారే స్వయంగా తొలగించాల్సి ఉంటుంది. నిరంతరం కొనసాగాల్సిన ఈ ప్రక్రియ అప్పుడప్పుడు మాత్రమే నిర్వహిస్తుండటంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.



ఏపుగా పెరిగిన అడవి తుమ్మ చెట్లతో చిట్టడవిని తలపిస్తున్న వాసవి నగర్‌లోని ఖాళీస్థలం

జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నాం..

గత రెండు రోజులుగా రెండు పొక్లెయిన్‌లు ఏర్పాటు చేసి కంప తొలగింపు పనులు నిర్వహిస్తున్నాం. ప్రైవేటు స్థల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. స్పందించని వారి స్థలాల్లో స్థలం పురపాలక సంఘానికి చెందినదిగా బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తాం.

– పి.శ్రీహరిబాబు, మున్సిపల్ కమిషనర్

దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి కృషి

అమరావతి: దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సక్షం జాతీయ సహకార్యదర్శి సురేష్ పాటిల్ చెప్పారు. సమదృష్టి క్షమాతా వికాసం అనుసంధానమండలి రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక శ్రీ సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో నిర్వహించారు. సురేష్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో దివ్యాంగుల అభివృద్ధి, సాధికారతకు సక్షం ఎన్నో ఏళ్లుగా స్వచ్ఛంద సేవా కార్య క్రమాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్ కార్యాచరణ నిర్ణయాలను సభ్యుల ముందుంచి ఆమోదించారు, కార్యక్రమంలో దక్షిణ భారత సంఘటన కార్యదర్శి కె.కృష్ణమోహన్, అమరావతి ఖండ కార్యవాహ గాజుల నరేంద్ర, ఖండ సంపర్క ప్రముఖ్ పులిపాటి వెంకట పవన్ కుమార్, శ్రీసరస్వతి శిశు విద్యా మందిర్ ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చిలకలూరిపేటటౌన్: తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పోషకాహారంతో క్రమం తప్పకుండా తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ శాంతకుమారి చెప్పారు. కావూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు బాలసంజీవని కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రాజేష్, ప్రత్యూష, సొసైటీ అధ్యక్షుడు కోడె హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత నివారణకు తాజా ఆకుకూరలు, సిరి ధాన్యాలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా అంగన్‌వాడీ సెంటర్‌లలో ఆరేళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువు చూపించి పోషకాహారం పొందాలన్నారు. ఆడబిడ్డలను చక్కగా చదివించుకోవాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు జరుగుతుంటే సమాచారమివ్వాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి జి.మాధవిలత, సూపర్‌వైజర్ భూలక్ష్మి, ప్రసన్న, హేమకుమార్, పోలయ్య, మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఒత్తిడి జయించేందుకు కరాటే పోటీలు దోహదం

సత్తెనపల్లి: ఒత్తిడిని జయించేందుకు కరాటే పోటీలు దోహదపడతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అర్బి డ్రాగన్ షూటో కాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన శోభారాణి బెల్ట్‌టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు.

యూరియా పంపిణీలో పక్షపాతం

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు

శావల్యాపురం: రైతులు ఎరువుల కోసం పొలం పనులు వదులుకొని మన గ్రోమార్ సెంటరు, సొసైటీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తురని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు సొసైటీ కార్యాలయాలు చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా సరిపడా యూరియా సంచులు ఇవ్వటం లేదన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మండలానికి ప్రభుత్వం కేటాయించిన యూరియా సంచులు రాత్రికి రాత్రే మాయం అవుతున్నాయన్నారు. గంటల తరబడి క్యూలైన్లో నిలబడిన రైతులకు స్లిప్పులు ఇవ్వటంలో అధికారులు పక్షపాతం చూపుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన రైతులకు ఆదనంగా యూరియా సంచులను ఇస్తూ ఇష్టానుసారంగా వ్యవరించుతున్నారన్నారు. ఒక్కో రైతుకు రెండు సంచులు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోడెపూడి శ్రీనివాసరావు, తిరివీధి రమణారావు, బొల్లా సుబ్బారావు, ఎస్‌కె సైదా, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

నకరికల్లు: మహిళలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం సూచించారు. దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యాన మండలంలోని చాగల్లు ఎస్సీకాలనీలో డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యతపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో డిజిటల్ చైతన్యం పెంపొందించి ఆర్థిక స్వావలంబనకు ముందడుగు వేయాలని డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్‌బ్యాంకు సిబ్బంది శైలజ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల ప్రాముఖ్యం, యూపీఐ, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సదుపాయాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగం, ఆర్థిక పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌ఆన్ మోసాలను గుర్తించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో మహిళాసంఘాల సభ్యులు, యువత పాల్గొన్నారు.

'కుప్పగంజి' ఉధృతం



ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కుప్పగంజివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గణపవరం – చిలకలూరిపేట డొంక రోడ్డులో చప్టాపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చప్టాపై రెండడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో పంచాయతీ అధికారులు వాహనాల రాకపోకలు నియంత్రించారు.

– నాదెండ్ల